## క్లుప్తంగా

### మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి బాధ్యతల స్వీకరణ


కమిషనర్‌కు మొక్క అందజేస్తున్న సిబ్బంది

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆయన వ్యక్తిగత పనులపై దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో మేనేజర్ యాకుబ్‌పాషా ఇన్‌చార్జ్ కమీషనర్‌గా విధులు నిర్వర్తించారు. తిరిగి శ్రీనివాసరెడ్డి రావడంతో ఆయనకు కమిషనర్ బాధ్యతలు అప్పగించారు.

### మండల పశువైద్యాధికారిగా జంపాల నరేష్



నేరేడుచర్ల : మండల పశువైద్యాధికారిగా జంపాల నరేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన పశువైద్యాధికారి రవినాయక్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నూతనంగా ఉద్యోగం సాధించిన నరేష్ పశువైద్యాధికారిగా నియమితులయ్యారు.

### అవిశ్వాస సమావేశం నేటికి వాయిదా

గరిడేపల్లి : మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై మంగళవారం జరగాల్సిన అవిశ్వాస సమావేశం బుధవారానికి వాయిదా వేసినట్లు జిల్లా సహకార అధికారి పద్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అత్యవసర కార్యాలయ పనులతో రాలేకపోతున్నట్లు, తెలంగాణ సహకార సంఘాల చట్టం ప్రకారం రిజిస్ట్రార్ సమావేశానికి అధ్యక్షత వహించడానికి వీలుకాకపోవడంతో సమావేశాన్ని నేటికి వాయిదా వేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నేడు 11గంటలకు జరిగే సమావేశానికి పాలకవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

### ఘనంగా దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి


మాట్లాడుతున్న జానకిరామారావు

కోదాడ : పట్టణంలోని తేజ పాఠశాలలో శారదా సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కలంతో సమాజాన్ని చైతన్య పరిచిన మహాకవి దాశరథి అని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ సమాఖ్య అధ్యక్షుడు సుశర్మ, మద్దెల చిన్నప్ప, జానకిరామారావు, సాధు ఫణికుమార్, శ్రీనివాసరెడ్డి, కోటయ్య, రామారావు, జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### క్షేత్రపాలకుడికి ఆకుపూజ


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, సిబ్బంది ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్

కోదాడరూరల్ : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో పాల్గొనడంతో వారిలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొరబండలో గల తేజ విద్యాలయ పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి 68 ఎస్‌జీఎఫ్ బాలబాలికల ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఈ పోటీల్లో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై కోదాడకు మంచి పేరుతేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా కన్వీనర్ కొండలు, ప్రకాష్, సీతారాంరెడ్డి తదితరులు ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు


కోదాడరూరల్ : తమ్మరలో నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాగులచవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయాలు, పుట్టల వద్ద బారులుదీరి పాలు, గుడ్లు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమ్మర నాగేంద్రస్వామి ఆలయానికి కోదాడ ప్రాంతంతో పాటు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ముదిగొండ మండల ప్రజలతో పాటు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి భక్తులు పాల్గొన్నారు. రామాపురం క్రాస్‌రోడ్, చిమిర్యాల, రామలక్ష్మీపురంలో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మర, రామాపురం క్రాస్‌రోడ్ ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

**ఘనంగా నాగుల చవితి**

హుజూర్‌నగర్ : పట్టణంలో నాగులచవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాగమయ్య పుట్ట వద్దకు తెల్లవారుజాముననే మహిళలు చేరుకుని పుట్టలో గుడ్లు, పాలు పోసి, పసుపు కుంకుమలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. పలు ఆలయాల్లో నాగదేవతల విగ్రహాలకు పాలు పోసి, కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పూజారులు, నిర్వాహకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌గర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీనాగేంద్ర సమేత పార్వతి పరమేశ్వర స్వామి దేవాలయంలో నాగమయ్య పుట్ట వద్ద మహిళలు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంత్రిప్రగడ వెంకటేశ్వరరావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పాత నేరేడుచర్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయం , పాత నేరేడుచర్లలోని ఆంజనేయస్వామి దేవాలయం, నేరేడుచర్ల మండలంలోని సోమప్ప దేవాలయం, దిర్శించర్లలోని రామాలయంతో పాటు వివిధ దేవాలయాల్లో ఉన్న నాగుల పుట్టల వద్ద పూజలు నిర్వహించారు.


మేళ్లచెరువు : నాగదేవతకు పూజలు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం వద్ద గల చెరువుకట్టపై నాగదేవత ఆలయంలో మహిళలు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా ఆలయంలో అన్నదానం చేశారు. మండలంలోని చౌటపల్లి, మఠంపల్లి, రఘునాథపాలెం, పెదవీడు, యాతవాకిల్ల, మట్టపల్లిలో గల నాగుల పుట్టల మహిళలు పూజలు చేశారు.

మేళ్లచెరువు : మండలంలో నాగులచవితి వేడుకలను భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయాలకు, పాముల పుట్టల వద్దకు వెళ్లి పుట్టలో పాలుపోసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద చిన్నారులకు చెవులు కుట్టించారు.

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామంలో మంగళవారం నాగుల చవితి పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నాగదేవత ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మునగాల : మండల కేంద్రంలోని నాగులమ్మ గుడిలో మంగళవారం నాగులచవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాగులమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ఆవరణలో ఉన్న పుట్టలో మహిళలు పాలు పోసి పూజలు నిర్వహించారు.

గరిడేపల్లి : మండలంలో మంగళవారం నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వీరన్నస్వామి ఆలయం పుట్ట వద్ద, శివాలయం ఆంజనేయస్వామి ఆలయం, సాయిబాబా ఆలయాల వద్ద కీతవారిగూడెం, కల్మలచెరువు గ్రామాల్లో దేవాలయాల వద్ద మహిళలు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.


హుజూర్‌నగర్‌రూరల్ : పూజలు చేస్తున్న మహిళలు


నేరేడుచర్లలో..


చిలుకూరు : కొండాపురంలో ..


మఠంపల్లి : బక్కమంతులగూడెంలో పూజలు చేస్తున్న మహిళలు


హుజూర్‌నగర్ : పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు, భక్తులు


మునగాలలో నాగులమ్మ దేవాలయంలో..


కోదాడరూరల్ : తమ్మరలో..

## చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

నేరేడుచర్ల : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలు–2024 వాల్ పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, జేవీవీ ప్రతినిధులు శ్రీరాములు, ఆంజనేయులు, సుంకరి క్రాంతికుమార్ మాట్లాడారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చెకుముకి పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రతాప్, శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్ తదితరులున్నారు.

## ఘనంగా షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం


సాయిబాబా విగ్రహానికి అభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

నడిగూడెం : మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా మందిర వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి పంచామృతాలతో పాటు ఫలరసాలతో అభిషేకాలు నిర్వహించారు. కోదాడ పట్టణానికి చెందిన జానకిరామయ్య గురూజీ భక్తులకు సాయి సత్సంగం ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల పురుషోత్తం, ఎంవీ.రమణారావు, సభ్యులు మహేష్, సత్యనారాయణ, కిరణ్‌కుమార్, సూర్యప్రకాశరావు, విజయ, ఉషారాణి, ఉష, పూజారి రాజశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పోరాడాలని మాలమహానాడు నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలో దగ్గుపాటి బాబురావు అధ్యక్షతన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. బుధవారం స్థానికంగా కౌండిన్య ఫంక్షన్ హాల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు, ఈ సమావేశంలో ఉద్యమంపై చర్చ, నూతన నియోజకవర్గ అధ్యక్షుడి ఎన్నిక, ఏడు మండలాల అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో పోతుల జ్ఞానయ్య, బెంజి, శీను, రాములు, పున్నయ్య, క్రాంతి, బాబురావు, కోటమ్మ, సావిత్రి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, నరసింహారావు, అరుణ్, రాము, వినోద్, ప్రవీణ్, రాజా పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి


అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : పేద ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. మంగళవారం పట్టణంలోని లాల్‌బంగ్లాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అమరువీరు వారోత్సవాల సందర్భంగా అమరులకు నివాళులర్పించి మాట్లాడారు. భూమి, భుక్తికోసం సాగిన విప్లవ పోరాటంలో అనేక మంది పోరుమార్గంలో పయనించి అమరులయ్యారని అన్నారు. అణగారిన వర్గాల వారికి అండగా దోపిడీ దౌర్జన్యాలకు రూపుమాపేందుకు అనునిత్యం అమరులు పోరుచేశారని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వక్కవంతుల నరసింహారావు, అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, కామల్ల రవి, విజయ్, రవితేజ, వెంకన్న, ఖాసీం, సైదులు, రామారావు ఉన్నారు.

## సభను విజయవంతం చేయాలి

గరిడేపల్లి : హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో ఈనెల 17న నిర్వహించే సెకండ్ ఏఎన్‌ఎంల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షురాలు కవిత కోరారు. మంగళవారం మండల ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓ నరసింహకు మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ముందస్తుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సెకండ్ ఏఎన్‌ఎంను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు 100శాతం గ్రాస్ శాలరీని అమలు చేయాలని, రూ.10లక్షల హెల్త్‌ఇన్సురెన్స్‌తో పాటు లైఫ్ ఇన్సురెన్స్ కూడా ప్రభుత్వమే కల్పించాలన్నారు. కార్యక్రమంలో విజయ, రాజకుమారి, సైదమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన


ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంఘమిత్ర

మోతె : మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ సంఘమిత్ర పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని సూచించారు. ఆమె వెంట ఆర్‌ఐ మన్సూర్ అలీ, ఏపీఎం వెంకయ్య, వీఓఏలు ఉన్నారు.

## తేజ విద్యాలయంలో 'సాక్షి' మ్యాథ్స్ బీ పరీక్ష


పరీక్షకు హాజరైన విద్యార్థులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయంలో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మంగళవారం సాక్షి మ్యాథ్స్ బీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో 45మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సాక్షి మీడియా ఆధ్వర్యంలో స్పెల్ బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపేందర్, స్వర్ణలత, హేమలత విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరిరావు

కోదాడరూరల్ : కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన పార్టీ 12వ పట్టణ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకుడు సీతారం ఏచూరితో పాటు పలువురికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, కుక్కడపు నళిని, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు, కోట రమేష్, జుట్టుకొండ బసవయ్య, జిల్లేపల్లి నరసింహారావు, మిట్టగణుపుల ముత్యాలు, కాసాని కిషోర్ తదితరులు ఉన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు మద్దతుగా ధర్నా


ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కోదాడ : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావుపై కొందరు కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అందుకు నిరసనగా కొమరబండ గ్రామానికి చెందిన దళితులు మంగళవారం పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రామారావు దళిత పక్షపాతిగా ఉండి కొమరబండ గ్రామంలోని దళిత కాలనీలో అనేక అభివృద్ధి పనులు చేశారని, ఆయనకు గ్రామ మాదిగలు ఎల్లప్పుడు మద్దతుగా ఉంటారని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఆయన గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. రాజకీయ లబ్ధి కోసం రామారావు చిత్రపటాన్ని దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోదాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దేవపంగు వెంకటేశ్వర్లు, చిన శంభయ్య, కొలికపంగు వెంకటేశ్వర్లు, శ్రీను, ధనమూర్తి, బాలకృష్ణ పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం**

కోదాడరూరల్ : జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వంగవీటి రామారావును మంగళవారం మండలంలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అన్నెం నరసింహారెడ్డి, అన్నెం పాపిరెడ్డి, సంజీవరెడ్డి, కొప్పుల అంజిరెడ్డి, తుపాకుల రామయ్య, యలమంద ఉన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


చిలుకూరు : శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ ధ్రువకుమార్


హుజూర్‌నగర్ : ఎన్యూమరేటర్ల శిక్షణలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

హుజూర్‌నగర్ : సమగ్ర కుటుంబ సర్వే పగడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో సర్వేలో భాగంగా సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు 2వదశ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే తప్పులు లేకుండా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇంటింటి సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సురిగి సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్యూమరేటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వేలో మొత్తం 76అంశాలలో సమగ్ర సర్వే చేపడుతున్నందున ఒక్కొక్క అంశం వివరంగా చదివి ఇంటి యజమానుల నుంచి వివరాలను సేకరించి దరఖాస్తులను పూరించాలన్నారు. మండలంలో మొత్తం 19గ్రామ పంచాయతీలకు 61మంది ఎన్యూమరేటర్లు, ఏడుగురు సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. అదే విధంగా మున్సిపాలిటీలో 15వార్డులకు 46 మంది ఎన్యూమరేటర్లు నియమించి ఒక్కొక్కరు 170 కుటుంబాల సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓళ సోమ సుందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, ఏఎస్ సురేందర్‌రెడ్డి, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

**సర్వే సమర్థవంతంగా పూర్తి చేయాలి**

చిలుకూరు : సమగ్ర కుటుంబ సర్వేను మండలంలో సమర్థవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ధ్రువకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వేకు మండల వ్యాప్తంగా 92బ్లాకులు ఏర్పాటు చేసినట్లు, 17గ్రామపంచాయతీలను 92బ్లాకులుగా విభజించి 92మంది ఎన్యూమరేటర్లను, 9మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ జగదీష్, ఏఎస్‌ఓ ఆశోక్, ట్రైనర్స్ చందా శ్రీను, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్యూమరేటర్లకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు హేమలత, ఏఎస్‌ఓ ఉపేందర్, ఆర్‌ఐ గోపాలకృష్ణ, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

## నాసిరకంగా సీసీరోడ్డు నిర్మాణం

మునగాల : మండలంలోని గణపవరం గ్రామపంచాయతీ పరిధిలో కాంట్రాక్టర్ సీసీరోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా లోపంతో చేపడుతున్నారని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి ధరావత్ రవి ఆరోపించారు. మంగళవారం గ్రామంలో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణంలో ఇసుక వినియోగించాల్సి ఉండగా డస్ట్ వాడుతున్నారని, అదే విధంగా దొడ్డు కంకరతో పనులు చేపడుతున్నారని అన్నారు. పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహారించడండతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేలా చూడాలని ఆయన కోరారు.

## కంపచెట్ల తొలగింపు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ ఆవాస గ్రామం మాచవరంలో రైతు సమన్వయ సమితి గ్రామ మాజీ కోఆర్డినేటర్ మాడుగుల పరుశరాం శ్రీరామాంజనేయ దేవాలయం ప్రాంగణంతో పాటు డ్రెయినేజీలో చెత్త, వీధుల్లోని కంపచెట్ల తొలగింపును సొంత ఖర్చులతో మంగళవారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ ప్రత్యేక అధికారి లేకపోవడంతో డ్రెయినేజీలలో చెత్త పేరుకుపోవడం, చెత్తను ట్రాక్టర్ ద్వారా తొలగించకపోవడంతో విషజ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున స్వచ్ఛందంగా పనులు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆవుల సైదులు, మీగడ కోటయ్య, మట్టపల్లి, సైదులు, గురవయ్య, గ్రామపెద్దలు ఉన్నారు.

## పారిశుద్ధ్య పనులకు చర్యలు

మఠంపల్లి : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానికంగా జేసీబీతో చేపడుతున్న కంపచెట్ల తొలగింపు, చెత్త డంపింగ్ తదితర పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈనెల 6నుంచి జరగనున్న సమగ్ర కుటుంబ సర్వేకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ మట్టయ్య, బిల్ కలెక్టర్ అన్వర్‌పాషా, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

## ఎత్తిపోతల పథకాల సిబ్బంది క్రమబద్ధీకరణపై హర్షం

మునగాల : సాగర్ ఎడమకాల్వపై నిర్మించిన పలు ఎత్తిపోతల పథకాలలో 40ఏళ్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించి పాతవారినే కొనసాగించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేయడం పట్ల మండలానికి చెందిన పలు ఎత్తిపోతల పథకాల చైర్మన్లు, సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కోదాడలో నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండలానికి చెందిన ఎత్తిపోతల పథకాల చైర్మన్లు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీరాములు, పోతుగంటి సోమేశ్వరరావు తదితరులు సిబ్బంది క్రమబద్ధీకరణ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో దేవరం శ్రీనివాసరెడ్డి, పందిరి శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, గోపి, నారాయణ, చారి తదితరులు ఉన్నారు.